క్లుప్తంగా

సత్యమ్మకు పూజలు


సత్యమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో ఆదివారం సత్యమ్మ తల్లికి భక్తులు భక్తిప్రపత్తులతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సత్యమ్మ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి, నాయకులు హేమచంద్రారెడ్డి, దూర్వాసులు రెడ్డి, భరత్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, ప్రసాద్ రెడ్డి, బాబురెడ్డి, సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు


చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం టూటౌన్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇరువారం, సంతపేట, కైలాసపురం తదితర ప్రాంతాల్లో వాహనదారులను ఆపి రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా గంజాయి విక్రయాలపై గాలించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎవరైనా గంజాయి విక్రయాలు చేస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు


గుడిపాల: బొమ్మసముద్రంలో టీకాలు వేస్తున్న పశువైద్య డాక్టర్లు

గుడిపాల: ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం పశువైద్య కేంద్రంలో ఆదివారం పశువైద్యులు సాయిసుధ, రవితేజలు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, ఈ విషయంలో యజమానులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ పిచ్చి కుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని తెలియజేశారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో అప్పటి నుంచి జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తున్నారన్నారు. అనంతరం 50 కుక్కలకు టీకాలను వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కిషోర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

- ఆన్‌లైన్‌లో కనిపించని మార్కెట్ విలువ, నిషేధిత భూముల వివరాలు
- చిత్తూరు నగర పరిధిలో మాత్రమే సమస్య అధికం
- రాష్ట్ర సర్వర్‌లో అప్‌డేట్ చేయాలంటున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు
- ఆన్‌లైన్‌లో అధికారుల లాగిన్‌లో మాత్రమే సమాచారం



ఆన్‌లైన్‌లో చూపని చిత్తూరు నగర భూ విలువ వివరాలు

ఐజీఆర్ఎస్‌లో వివరాలు కనిపిస్తే ఒట్టు

నగరానికి చెందిన రవి స్థలం కొనుగోలు చేయాలని వాటి విలువను తెలుసుకోవడానికి రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో చూశాడు. అందులో లేకపోవడంతో డ్యాకుమెంట్ రైటర్‌ను సంప్రదించగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే సమాచారం ఉంటుందని ప్రభుత్వ సెలవుదినం కావడంతో మరుసటి రోజు రావాలని చెప్పాడు. మరుసటిరోజు వెళ్లగా అధికారులు బిజీగా ఉన్నారని సాయంత్రం రావాలని చెప్పి పంపారు. ఇది ఒక రవి సమస్యే కాదు. నగర పరిధిలో ఆస్తులు కొనుగోలు చేయాలంటే అవసరమైన సమాచారం కోసం నేరుగా చిత్తూరు అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. పలు నెలలుగా సమస్య ఉన్న పరిష్కారం కావడం లేదు.


రద్దీగా ఉన్న చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: ఎవరైనా భూమి కొనుగోలు చేయాలనుకున్నప్పుడు మొదట ఈసీ(ఎన్‌కంబరెన్స్‌మెంట్ సర్టిఫికెట్) తీసుకుంటారు. ఆ తర్వాత భూమి మార్కెట్ విలువ, నిషేధిత జాబితాలో భూమి/స్థలం ఉందా ? అని పరిశీలించుకుంటారు. తదుపరి మార్కెట్ విలువ ఆధారంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్టర్ చేసుకుంటారు. ఎక్కడైనా ఈ ప్రకారమే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే భూముల విలువ, ఇతర వివరాలను ఎవరైనా ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు ఉంది. కానీ జిల్లా కేంద్రంలోని చిత్తూరు నగరం మినహాయించి అన్ని ప్రాంతాల సమాచారం వెబ్‌సైట్‌లో దర్శనమిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర సర్వర్(ఐజీఆర్ఎస్)లో సంబంధిత భూ ప్రాంతాల కోడ్స్‌ను అప్‌డేట్ చేయకపోవడంతో సమస్య తలెత్తింది. గత కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా.. రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించడం లేదని క్రయ,విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో అధికారుల లాగిన్‌లో మాత్రమే సమాచారం వస్తోంది. పబ్లిక్‌కు సమాచారం రావడం లేదు.

ఆన్‌లైన్‌లో కనిపించని వివరాలు..

చిత్తూరు జిల్లా పరిధిలోకి చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, బంగారుపాళెం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి, కార్వేటినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వస్తాయి. సాధారణంగా భూమి, స్థలం, భవనాలకు సంబంధించి తాకట్టు, గిఫ్ట్, సేల్, సెటిల్‌మెంట్ డీడ్‌ల పరంగా రిజిస్ట్రేషన్స్ చేసేటప్పుడు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో వాటి మార్కెట్ విలువను చూస్తారు. వాటి ఆధారంగా విస్తీర్ణం, కట్టడం విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారు. డీకేటీ, ప్రభుత్వ నిషేధిత స్థలాలను సైతం కొనుగోలుకు ముందు పరిశీలించుకున్న తర్వాతే పత్రాలు సిద్ధం చేసి రుసుం చెల్లిస్తారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానం కావడంతో ముందుస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. సూచించిన సమయంలో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. దీంతో అన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఎందుకంటే ఆ స్లాట్ మారితే మరోస్లాట్ బుక్‌చేసుకోవాలంటే రుసుం చెల్లించాల్సి ఉంది.

ఇవీ సమస్యలు

మార్కెట్ విలువ తెలుసుకుని విస్తీర్ణం, కట్టడం ఆధారంగా రిజిస్ట్రేషన్స్ ఫీజులు చెల్లించి ప్రక్రియ పూర్తి చేసుకుంటారు. నగరంలో చదరపు గజం ప్రారంభ విలువ రూ.2,200 కాగా గరిష్ట విలువ రూ.51,500గా ఉంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలలో దాదాపు 720కి పైగా రిజిస్ట్రేషన్స్ జరుగుతున్నాయి. వీటి ద్వారా శాఖకు రూ.2 నుంచి రూ.3 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. చిత్తూరు నగర పరిధిలో దాదాపు 25కి పైగా ప్రాంతాలకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో లేవు. డ్యాకుమెంట్ రైటర్లు, లాయర్లు పత్రం సిద్ధం చేయాలంటే నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. పత్రాలను ముందే సిద్ధం చేసుకుంటారు. ప్రభుత్వ సెలవుదినాలు, ఆదివారం, రెండో శనివారం మాత్రమే కార్యాలయాలు ఉండవు. ఒకవేళ ఆ సమయంలో సబ్‌రిజిస్ట్రార్లు బిజీగా ఉంటే వేచి చూసి తీసుకోవాల్సి ఉంది. రాష్ట్ర అధికారులకు సమస్యను తెలియజేశామని త్వరలో పరిష్కారిస్తారని జిల్లా అధికారులు చెబుతున్నారు.



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు నగర పరిధిలోనే సమస్య..

చిత్తూరు నగర పరిధిలో మాత్రమే ఈ సమస్య ఉంది. నియోజకవర్గ పరిధిలోని గుడిపాల, చిత్తూరు మండలం, చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని యాదమరి ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు అందుబాటులో ఉన్నాయి. కానీ నగర పరిధిలో ఇవి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. గతంలో చిత్తూరు నగరంలో తహసీల్దార్ కార్యాలయం ఒకటి మాత్రమే ఉండేది. ప్రస్తుతం చిత్తూరు అర్బన్, రూరల్ కార్యాలయాలుగా విభజన జరిగింది. దీంతో కార్యాలయాల వారీగా ఉండే ప్రాంతాల కోడ్స్ విభజన జరిగింది. మార్పు చేసిన వాటి వివరాలను రాష్ట్ర రిజిస్ట్రేషన్ అధికారులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.లక్ష నగదు విరాళం అందించారు. చిత్తూరుకు చెందిన దాత చిన్నస్వామి నాయుడు ఆదివారం కాణిపాకం ఆలయానికి చేరుకుని విరాళాన్ని ఆలయ అధికారులకు విరాళంగా అందించారు. అనంతరం దాత కుటుంబానికి అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


ఊంజల్ సేవలో స్వామివారు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలు చేశారు. ఊంజల్ సేవలో స్వామివారు కనువిందు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం

ఐరాల: కాణిపాకంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ బంగారుపాళెం మార్కెట్ యార్డుకు విచ్చేస్తున్న సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు, నియోజకవర్గ అనుబంధ విభాగం నాయకులు, రాష్ట్ర అనుబంధ విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

జోరుగా హెలీప్యాడ్ ఏర్పాటు పనులు


కొత్తపల్లె హైవే పక్కన హెలీప్యాడ్ కోసం చదును చేస్తున్న దృశ్యం


ముళ్ల కంపలను తొలగిస్తున్న చేస్తున్న దృశ్యం

బంగారుపాళెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 9న బంగారుపాళెం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ ఏర్పాటు పనులు జోరుగా జరుగుతున్నాయి. మామిడి రైతులకు మద్దతుగా నిలిచి వారి బాధలు తెలుసుకునేందుకు మాజీ సీఎం వస్తున్నారు. హెలీప్యాడ్ పనులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ఆదేశాల మేరకు పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో మండల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ కొత్తపల్లె సమీపంలో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి పక్కన వైఎస్ జగన్ రాకకోసం హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు చెప్పారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్ వేర్వేరుగా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న నాయకులు కోదండన్

చిత్తూరు కార్పొరేషన్: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక నాయకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు కోదండన్, గంగరాజు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడానికి లేబర్ కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు కూడా భద్రత లేకుండా పోతుందని తెలిపారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు సమ్మె జరుగుతుందన్నారు. జిల్లాలో కూడా అన్ని కేంద్రాల్లోనూ ప్రదర్శనలు మానవహారాలు చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాపాడాలని, లేదంటే, తరువాత జరిగే పరిణామాలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, నాయకులు చంద్ర, రమాదేవి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


సీతారామలక్ష్మణులు, ధ్వజారోహణ చిత్ర పటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


ముక్కోటి దేవతలను వేదపండితులచే పిలుపునిస్తూ వైభవంగా నిర్వహించిన ధ్వజరోహణం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు చేపట్టారు. ముందుగా సీతారామలక్ష్మణులను, చిత్రపటాన్ని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం వేదపండితులు వార్షిక బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ధ్వజస్తంభం దగ్గర ప్రత్యేక పూజలు చేసి ఆహ్వానించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిప్రపత్తులతో స్వామికి తిరుమంజనం..

ఆలయంలో ఉదయం ఉభయదారులచే స్వామికి తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులకు ఊంజల్‌సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

హంస వాహనంపై శ్రీరామచంద్రుడు

ఆదివారం రాత్రి హంస వాహనంపై శ్రీరామచంద్రుడు భక్తులను కటాక్షించారు. ఉదయం వేద పండితులు ఉత్సవమూర్తి శ్రీరామచంద్రుడికి అభిషేకం , ప్రత్యేక, అలంకరణ, నైవేద్యం సమర్పించారు.

నేడు సింహ వాహనసేవ..

కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు సింహవాహనంపై దర్శనమిస్తారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకుందామని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. కాణిపాకం మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలపై ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉభయదారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకుందామని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉభయదారులంతా సహకరించాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా బ్రహ్మోత్సవాలను పూర్తి చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. బ్రహ్మోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించేలా చేద్దామన్నారు. సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ బాబు, దేవస్థానం మాజీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, జగన్నాథ రెడ్డి, మణి నాయుడు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనంజయ, ధనపాల్, సూపరింటెండెంట్లు, అర్చకులు, వేద పండితులు, 14 గ్రామస్తుల ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

పొలం మొక్కుబడిగా పిలుస్తోంది

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంటల సాగులో చేపట్టాల్సిన మెలకువలు, సస్యరక్షణ, అధిక దిగుబడి సాధించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి నిర్వహించే పొలం పిలుస్తోంది సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి అసలు హాజరు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు కొన్నిశాఖల అధికారులు హాజరైనా ఇలా వచ్చి.. అలా ఫొటో దిగి వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ఖరీఫ్‌లో రైతులకు పూర్తిస్థాయిలో అందని సలహాలు, సూచనలు
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు
- పదిశాఖల అధికారులు విధిగా పొలం పిలుస్తోందికి వెళ్లాలి
- కానీ క్షేత్రస్థాయిలో వ్యవసాయ మినహా కనిపించని అనుబంధ శాఖల అధికారులు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

గుడిపాల: రైతులకు ఉన్న సందేహాలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా చైతన్య పరిచేందుకు నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశం . రైతులకు సలహాలు ఇచ్చేందుకు రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి వారం నాలుగు పల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరగాలి. వారంలో మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే మండలంలోని 32 రెవెన్యూ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించేందుకు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. అయితే ఆహార, వాణిజ్య, పండ్లు, పూలతోటలు, పట్టు తదితర సాగుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే గుడిపాల మండలంలో మాత్రం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు వస్తున్నా.. అనుబంధ శాఖల వారు పూర్తి స్థాయిలో హాజరుకావడం లేదు. వ్యవసాయ శాఖతో పాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, కోపరేటివ్ ఫెడరేషన్, మార్కెటింగ్‌శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయ తదితర సుమారు పదిశాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉంది. వాస్తవానికి ఒకటి, రెండుశాఖల అధికారులు మాత్రమే మొక్కుబడిగా వస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రం రైతుసేవా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రైతుల నుంచి స్పందన లేదు. దీంతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించి ఫొటోలు దిగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొలాలకు వెళ్లి.. ఫొటోలు దిగి జంప్..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. అదేవిధంగా నూతన సాగు పద్ధతులు, మేలు రకాల వంగడాలు, ఉత్తమ సాగు ఫలితాలపై అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను చైతన్య పరచాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటుచేసి రైతుల అనుమానాలను తీర్చాల్సి ఉంటుంది. అయితే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. దీంతో పండ్లు, పూలతోటల సాగు రైతులకు సూచనలు, సలహాలు ఏమాత్రం అందడం లేదు. ఖరీఫ్‌లో రెగ్యులర్ పంటలతో పాటు మిరప, మామిడి, జామ, సపోట, కొబ్బరి, నిమ్మ వంటి పంటలు సాగులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు సలహాలు, సూచనలు అందడం లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎంపిక చేసిన పొలాల్లోకి వెళ్లి ఫోటోలు దిగి వస్తున్నారనే ప్రచారం సాగుతోంది పొలం పిలుస్తోంది.

సారోళ్లు రావడం లేదు..



పండ్లు, పూల తోటల సాగుకు ముందుకు రావాలని రైతులను అధికారులు వెంటపడి పంటలను నాటిస్తారు. అయితే మొక్కలు నాటుకున్నాక సంబంధిత అధికారులు ఎవరూ కూడా రైతుల దగ్గరకు రావడం లేదు. పండ్ల తోటలను సాగు చేసుకున్న మాలాంటి రైతులు వాటిని ఎలా కాపాడుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నాం. పండ్లు, పూలతోటల పంటల సంరక్షణ, మంచి దిగుబడులు ఎలా సాధించాలన్నా కొత్త విషయాలు తెలియడం లేదు. –జ్యోతి, రైతు, చీలాపల్లె

అందుబాటులో ఉండాలి..



పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు సంబంధిత అధికారులు సక్రమంగా హాజరు కావడం లేదు. ఆయా శాఖలు పాల్గొని ప్రభుత్వ పథకాలు, పంటల సంరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేస్తే బాగుంటుంది. ప్రత్యేక కార్యక్రమాలకు సైతం అధికారులు హాజరు కాకపోవడం మంచిది కాదు. ఇప్పటికైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవశాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి. – రజినీకాంత్, సర్పంచ్, వసంతాపురం

అన్ని శాఖలకు సమాచారం ఇచ్చాం



ప్రతి వారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కార్యక్రమ నిర్వహణపై అన్ని శాఖల అధికారులకు షెడ్యూల్ పంపించాం. అదే విధంగా ఆయా గ్రామాల రైతులకు సైతం ముందురోజే కార్యక్రమంపై సమాచారం ఇస్తున్నాం. కొన్ని గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆత్మా, ఉద్యానవన, వెటర్నరీ అధికారులు మాత్రం వచ్చారు. రైతులకు అన్ని రకాల సలహాలు, సూచనలు ఇస్తున్నాం. –సంగీత, వ్యవసాయాధికారి, గుడిపాల

వెంటనే గ్రాట్యూటీ చెల్లించాలి

పలమనేరు: ఉద్యోగ విరమణ చేసిన వారికి వెంటనే గ్రాట్యూటీ చెల్లించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సోమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం డివిజన్‌లోని పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ముందుగా వారు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ గ్రాట్యూటీ చెల్లింపులను ఆపలేదన్నారు. గత ప్రభుత్వం కోవిడ్ సమయంలోనూ వీటిని చెల్లించిందని గుర్తు చేశారు. పీఆర్సీ ఆలస్యమవుతున్న కారణంగా ఉద్యోగ విరమణ చేసిన వారు ప్రయోజనాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాలన్నారు. అదే విధంగా ఎంటీఎస్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం నేతలు శ్రీనివాసులు, పరుశురామ్, జగదీష్, ఉమాపతి, రెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.